నెట్ బాల్ జట్ల ఎంపిక



జట్ల ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్ బాల్ మెన్ అండ్ ఉమెన్ జట్లను సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిక చేశారు. జైపూర్‌లోని సురేష్ జ్ఞాన్ విహార్ యూనివర్సిటీలో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో ఈ జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో చీఫ్ సెలక్టర్‌గా డాక్టర్ ఎస్ సోమేశ్వర్ కుమార్ వ్యవహరించారు. వివిధ కళాశాలల నుంచి ఫిజికల్ డైరెక్టర్లు, 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

కమిటీహాల్ నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మాగాంధీ నగర్‌లో రూ.50 లక్షల నిధులతో నిర్మిస్తున్న కమిటీ హాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిటీ హాల్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టి గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'హార్ట్‌ఫుల్‌నెస్'



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం హార్ట్ ఫుల్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడిని తొలగించుకొని చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. భవిష్యత్ ప్రణాళికలు నిర్మించుకోవాలని సూచించారు. మెడిటేషన్ ద్వారా మానసిక ఆరోగ్యాన్ని ఎలా పొందవచ్చు అనే అంశంపై సంస్థ ప్రతినిధి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివరించారు. మరో మూడు తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థులతో యోగా, మెడిటేషన్ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాల పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తదితరులు

బాలానగర్: చెరబండ రాజు నగర్‌లో సీఎస్ఆర్ ఫండ్స్ కింద గ్లాండ్ ఫార్మా కంపెనీ వారు నిర్మిస్తున్న జిల్లా పరిషత్ పాఠశాల పనులను శుక్రవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ వెంకటేష్, సూపర్‌వైజర్ వంశీ, నాయకులు యాదగిరి, గాలిపల్లి ఓదయ్యా, కల్వకుంట్ల స్వాతి, రంగంపేట్ శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, రామచంద్రాచారి, రాజు, మహ్మద్ సోఫీ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లేబర్ సెల్ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా భాస్కర్



సప్పిడి భాస్కర్

మూసాపేట: టీపీసీసీ లేబర్ సెల్ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా మూసాపేటకు చెందిన సప్పిడి భాస్కర్‌కు శుక్రవారం టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ ఆర్. ప్రకాష్ గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్ సెల్ తరపున కార్మిక చట్టం పరిధిలోకి వచ్చే అర్హులైన అన్ని రంగాల కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు.

ఆలయానికి విరాళం అందజేత



చెక్కు అందజేస్తున్న భక్తుడు లాల్‌కిషోర్

మోతీనగర్: ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని శివ రామాంజనేయ ఆలయ కమిటీ ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగార్ అన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ అవంతినగర్ కబీర్ నగర్‌లో నిర్మించిన శివ రామాంజనేయ ఆలయానికి భక్తుడు లాల్ కిషోర్ రూ.10,116ల చెక్కును శుక్రవారం అందజేశారు. ఆలయాల అభివృద్ధికి విరాళం అందజేసి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

పండుగ చేసుకుందాం..

- నేడు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో సంబురాలు
- వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు
- సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులతో ముఖాముఖి



సాక్షి,సిటీబ్యూరో: మెస్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం విద్యాలయాల్లో సంబురాలు నిర్వహించనున్నారు. గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు 8 ఏళ్ల తర్వాత ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. అంతేగాక 16 ఏళ్ల తర్వాత విద్యార్థులకు నెలవారీగా అందించే కాస్మోటిక్ చార్జీలు, సబ్బుల చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మూడో తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలు నెలకు రూ.950 నుంచి రూ.1330కు పెంచగా, కాస్మోటిక్ చార్జీలు రూ.55 నుంచి రూ.175 వరకు, 8వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నెలకు మెస్ చార్జీలు రూ.1100 నుంచి రూ.1540వరకు, కాస్మోటిక్ చార్జీలు రూ.75 నుంచి రూ.275 వరకు పెంచారు . హెయిర్ కటింగ్ చార్జీలు 3 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.62 నుంచి రూ.150 వరకు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.62 నుంచి రూ.200 వరకు ప్రభుత్వం పెంచింది. అలాగే కాలేజీ విద్యార్థులకు నెలకు మెస్ చార్జీలు రూ.1500 నుంచి రూ.2100 కు పెంచారు.

వేడుకలు ఇలా..

మేడ్చల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలకు సంబంధించిన 61 హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల్లో ప్రముఖులను ఆహ్వానించి, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో రోజువారీగా అందించే ఆహార పదార్థాల పట్టికను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన పదార్థాలతో రుచిగా, శుచిగా ఆహారాన్ని వండి వడ్డిస్తున్నారని అవగాహన కల్పించనున్నారు. ప్రతి ఆదివారం మెనూలో విద్యార్థులకు ప్రత్యేకంగా చికెన్‌తో వండి వడ్డించే ఆహారాన్నే ఆ రోజు పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విందు భోజనంగా అందించనున్నారు

కార్యక్రమాలు ఇవీ..

మేడ్చల్ జిల్లాలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి/ఎంపీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ /కలెక్టర్/కమిషనర్ తదితర ప్రముఖులు హాస్టళ్లను సందర్శించి తనిఖీలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రముఖులు సహపంక్తి భోజనాలు చేస్తారు.

కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న పట్నం సునీతా మహేందర్‌రెడ్డి

- ఐకమత్యంతో పార్టీని అభివృద్ధి చేయాలి
- మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీతామహేందర్‌రెడ్డి

మూసాపేట: కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని అభివృద్ధి చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని, ఇప్పుడు పెట్టుబడులు తీసుకువచ్చి అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్పొరేటర్ ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. కార్యకర్తలు ఐక్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రజల్లో ఉండి పనులు చేసిన వారిని పార్టీ గుర్తిస్తుందన్నారు. పార్టీ పేరు, నాయకులు పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కష్టపడి పని చేసే వారికి తప్పకుండా పదవులు వస్తాయని, ఎవ్వరూ కూడా నిరాశ చెందవద్దన్నారు. సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ.. సరైన సమయంలో పార్టీ గుర్తించి పదవులు ఇస్తుందని అన్నారు. ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమన్నారు. కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా తన కార్యాలయానికి రావాలన్నారు. కార్పొరేటర్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని 9 సీట్లు కైవసం చేసుకుందామని అన్నారు.

నాయకుల మధ్య వాగ్వాదం

పార్టీలో సీనియర్ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు లేదని పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా సస్పెండ్ చేస్తూ పార్టీలో గుర్తింపు లేదని చెప్పడంతో గాలి బాలాజీ, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ మధ్య వాగ్వాదం జరిగింది. పలువురు నాయకులు, కార్యకర్తలు స్టేజ్ వద్దకు చేరుకున్నారు. వాగ్వాదం పెద్దది అవుతున్న క్రమంలో జిల్లా అధ్యక్షులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. పలువురు నాయకులు సమావేశం ప్రారంభం ముందే అలిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, రాఘవేందర్, సాధుప్రతాప్ రెడ్డి, వేణు, గాలి బాలాజీ, కర్క పెంటయ్య, మోయిజ్, ఆయా డివిజన్‌ల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గొడవపడుతున్న నాయకులు

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి బోనాల ఊరేగింపు



ఓల్డ్ బోయిన్‌పల్లి: మట్టి వడ్డెర బస్తీలో బంగారు మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వేముల మల్లేష్, వేముల శ్రీను, కుమార్, మక్కాల నరేష్, కుమార్, గోపాల్, సాయి, వీరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు ప్రముఖుల పేర్లు పెట్టాలి

కేపీహెచ్‌బీకాలనీ: విశ్వవిద్యాలయంలో నిర్మించే నూతన వసతి గృహాలకు సంత్ సేవాలాల్ బాలుర వసతి గృహంగా, ఝల్కారీబాయి బాలికల వసతి గృహంగా నామకరణం చేయాలని జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో రెండు వసతి గృహాలను నూతనంగా ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సాధ్యమైనంత త్వరగా ఆయా వసతి గృహాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వసతి గృహాలను ఎస్సీ, ఎస్టీ నిధులతో నిర్మిస్తున్నందున ఆయా వసతి గృహాలకు, ఆయా దళిత, గిరిజన జాతుల్లో పుట్టి దేశానికి, సమాజానికి సేవలు చేసిన వారిలో ప్రముఖుల పేర్లను నామకరణం చేయాలన్నారు. కార్యక్రమంలో శివకృష్ణ, దుర్గాప్రసాద్, ధనుంజయకుమార్, హేమంత సిద్దార్థ, ఆనంద్‌కుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వెండి, రజిత వక్షస్థల కైంకర్యాల విరాళం



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లోని భూనీల సమేత వేంకటేశ్వర స్వామి వారికి సుమారు రెండున్నర లక్షల విలువ చేసే వెండి, రజిత వక్షస్థల కైంకర్యాలను దాతలు గణేశుల నాగేశ్వరరావు, నాగవరలక్ష్మి, కావూరి చంద్రశేఖర్, నాగసుందరి దంపతులు శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సిరికి శ్రీనివాస్, కేశవరావు, బొంత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని న్యూ ఎరా పాఠశాలలో శుక్రవారం పాఠశాల వ్యవస్థాపకురాలు శివకుమారి జయంతి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 4, 5 తరగతుల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జి అపర్ణ, న్యూ ఎరా కాలేజీ డైరెక్టర్లు జవహర్, వంశీరెడ్డి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర కమిటీ ఎన్నిక

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర కమిటీని శుక్రవారం ప్యారడైజ్ బంకెట్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. సమావేశానికి జేఎన్‌టీయూహెచ్ జేఏసీ యూనివర్సిటీ కమిటీ అధ్యక్షుడు ఆదిమల్ల పవన్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ మురళీధరన్, డాక్టర్ విజయ్ మోహన్‌రావు హాజరై ఆర్గనైజేషన్ నిర్మాణ నైపుణ్యం -యూనివర్సిటీలో విద్యార్థుల నాయకత్వ లక్షణాలు అనే అంశాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ మురళీధరన్, చీఫ్ అడ్వైజర్‌గా డా. విజయ్‌మోహన్‌రావు, చైర్మన్‌గా బొట్ల భిక్షపతి, వైస్ చైర్మన్‌గా అంబటి తేజ, ప్రెసిడెంట్‌గా బల్లగ్ సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాస్యం విక్రాంత్, జనరల్ సెక్రటరీగా దిలీప్, ఉపాధ్యక్షులుగా పి. సుకుమార్ రెడ్డి, టి. తేజ, ఏ.రాజుకుమార్, వి. సంజయ్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కె. సాయి భరవి, సెక్రటరీలుగా శ్రావణ్, శివాజీ, జాయింట్ సెక్రటరీలుగా శ్రీకాంత్, టి. నయాసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాములు, ప్రణవ్, సాయి శరత్, మెంబర్స్‌గా ముజాఖ్, యశ్వంత్, లీగల్ అడ్వైజరీలుగా డి. శ్రీకాంత్, శ్రీచైతన్య యాదవ్, సలహాదారులుగా గంధం రాములు, డా. రాజేష్ ఖన్నా, బి. సిద్దార్థ్, డి. శ్రీనివాస్ నాయక్, డా. రవీందర్, రమేష్, ప్రదీప్, అయినేని సంతోష్‌లను ప్రకటించారు.



కార్యక్రమంలో పాల్గొన్న జేఏసీ నాయకులు, ప్రొఫెసర్లు

ముగిసిన జాతీయ సదస్సు

మాదాపూర్: మాదాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌చే స్పాన్సర్ చేయబడిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ప్రముఖ నిపుణులు, పరిశోధకులు, వివిధ కళాశాలల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఔషధాల ఆవిష్కరణలు, ఫార్మసీ రంగం అభివృద్ధి గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఎస్.వాణిదేవి, కళాశాల డైరెక్టర్ అజిత, సురభి పాల్గొన్నారు.

10/10 సాధించడమే లక్ష్యంగా..

- ప్రభుత్వ పాఠశాలలో పకడ్బందీగా ప్రణాళికలు
- పదిలో వందశాతం ఉత్తీర్ణతకు చర్యలు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



బబ్బుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

మోతీనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రెండు మండలాలైన బాలానగర్, కూకట్‌పల్లిలో మొత్తం 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో బాలానగర్‌లో 6, కూకట్‌పల్లిలో 7 ఉన్నాయి. మొత్తం సుమారు 1150 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు

జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రతి రోజు సాధారణ తరగతులతో పాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు రోజుకు ఒక సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటి వద్ద విద్యార్థులు చదువుకుంటున్నారా?, హోంవర్కు చేశారా? అని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులతో పాటు హెచ్ఎంలు వారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. అసైన్‌మెంట్, యూనిట్ టెస్టులను నిర్వహిస్తూ వారికి 10/10 వచ్చే విధంగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ప్రతి ఐదుగురి విద్యార్థులను ఒక ఉపాధ్యాయుడు దత్తత తీసుకుంటున్నారు. ప్రత్యేక తరగతులను ఎంఈఓ పర్యవేక్షిస్తున్నారు.

అందరి సహకారంతో కృషి



ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో నెలకొన్న సందేహాలను సంబంధిత ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ఇంటి వద్ద విద్యార్థులు చదువుతున్నారా? లేదా? అని తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారాన్ని తెలుసుకుంటున్నాం. అందరి సహకారంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. – వకుళాదేవి, హెచ్ఎం, బబ్బుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సందేహాలను నివృత్తి చేస్తున్నారు



మాకు ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల్లో ఎలాంటి సందేహాలు ఉన్నా ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇంటి వద్ద చదువుతున్నామో లేదో తెలుసుకోవడానికి మా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఫోన్ చేస్తున్నారు.

– పి. ప్రణీత్, 10వ తరగతి విద్యార్థి

ప్రత్యేక తరగతులతో మరింత ప్రోత్సాహం



ప్రత్యేక తరగతులతో మాకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. ప్రతి రోజు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ఫోకస్ చేస్తున్నారు. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నామో తెలుసుకుని రాణించేలా ప్రోత్సహిస్తున్నారు.

– కె. అంజలి కుమారి, 10వ తరగతి విద్యార్థిని